# "టోటల్ థియేటర్" శైలిలో "కాయితం పులి"

**- కె. శ్రీహరిమూర్తి**

కేంద్ర విశ్వవిద్యాలయంలోని సరోజినీనాయుడు స్కూల్ నాటకవిభాగం రవీంద్రభారతిలో రెండోసారి "కాయితం పులి" నాటకం ప్రేక్షకజన హర్షదాయకంగా ప్రదర్శించింది. హిందీలో భీష్మ సహానీ "పోస్టర్" అనే నాటికకు యిది అనుసరణ. తెలుగు అనుసరణలో మూలంలో లేని పాటలు చాలావున్నాయి. ప్రతి సన్నివేశమూ రసభరితంగా సాగి విద్యార్థుల క్రమశిక్షణను తెలియచేస్తున్నది. ఇదివరకే 'రాజా ఈడిపస్', 'ప్రజల మనిషి' వంటి పలు ప్రతిభావంతమైన నాటకాలు అనువదించి దర్శకత్వం వహించిన ఆచార్య నాగభూషణశర్మగారి దర్శకత్వానికి యిది మరో కలికితురాయి.

"టోటల్ థియేటర్" అని మనం వ్యవహరించే "సంపూర్ణ నాటకప్రదర్శన" యీ నాటకం. మైమ్, ఆట, పాట, నాటకం అంతటా నిండివుండి ప్రతిక్షణం తరువాత ఏం జరుగుతుందన్న ఉత్కంఠభరితంగా సాగింది నాటకం ఆసాంతం. అందుకు ప్రతి ఒక్క నటుడు సహకరించడం చూస్తే యిది ప్రొఫెషనల్ థియేటర్ గ్రూప్ ప్రదర్శించినంత పకడ్బందీగా నడిచిందనిపిస్తుంది.

ఒక ఊళ్లో ఒక రామాలయం. శ్రీరామనవమికి రాములవారిని కీర్తించడానికి, రామభజన చేయడానికి ఒక కీర్తనకారుడిని, ఆయన బృందాన్ని పిలిపించారు. ఆయన రామభజన చేస్తూవుండగా ఒక శ్రోత ఆవేశంతో లేచి యిక్కడ - యీ అపవిత్ర ప్రదేశంలో రాములవారి భజన చేయకండి - అంటాడు. "ఎందుకు? ఎందుకు భజన చెయ్యవద్దంటావు?" అని అడుగుతాడు కీర్తనకారుడు. "నేను చెప్పలేను స్వామీ! నేను అసలు విషయం చెబితే నన్ను, నా వాళ్లని ఎవ్వరినీ బ్రతకనివ్వరు" అంటాడు. మళ్లీ కీర్తనకారుడు "సంగతేమిటో చెప్పు" అంటాడు. చివరకు ఈ గుడివెనక పొదల్లో ఒక బీదయువతి మీద దారుణమైన అత్యాచారం చేసి, ఆమెను అక్కడే పాతిపెట్టారు. ఈ గుళ్లోనే - అని చెబుతాడు. ఆ అత్యాచారం చేయబడ్డ యువతి తండ్రి నిస్సహాయుడు. ఏమీ మాట్లాడలేడు. వారంతా యిప్పుడు మీ ఎదుట గుళ్లోనే ఉన్నారు - అనే భయంకరమైన నిజాన్ని చెబుతాడు. ఆ దుర్మార్గులెవరో చెప్పమని భక్తులంతా నిలదీస్తారు. "నేను చెప్పలేను... దయచేసి మీరు ఈ అపవిత్రమైన స్థలంలో రామభజన చెయ్యకండి" అని వేడుకుంటాడు ఆ శ్రోత.

కీర్తనకారుడు యీ పిరికిమాటలు విని "మేం కిరాయి కీర్తనకారులం కాదు. ఆత్మని మేల్కొల్పలేని, అన్యాయాన్ని ఎదుర్కొని పోరాడలేని సిద్ధాంతం అంటే మాకు నమ్మకంలేదు.... ఇటువంటి సంఘటనలు జరుగుతున్నది యీ వూళ్లోనేనా?" అని ప్రశ్నించి 'నేనొక కథ చెబుతాను, వినండి' అంటాడు.

ఒక చిన్న వూరు. చుట్టూ దట్టమైన అడవి. ఆ వూరికి ఒక పటేలు. ఆయనకు వేలకువేలు లాభాలొచ్చే వ్యాపారాలు. అడవుల్లో ఊరికే దొరికే కుంకుళ్లు, ఇప్పపువ్వు, తేనె, సారపప్పు, చింతపండు - యివీ ఆయన వ్యాపారం. ఆ అడవి చుట్టుపక్కల ప్రాంతాలన్నీ తన కైవసం చేసుకున్నాడు. ఆ వూళ్లోవాళ్లని కూలీలను చేసి, వాళ్లకు పాతికో పరకో యిచ్చేవాడు. తెచ్చిన వస్తువుల్ని బాగుచేయడం, గోతాల్లో కెత్తడం యిక్కడి కూలీల పని.

వాళ్లు ఖుషీగానే పనిచేస్తూ వుండేవాళ్లు. "పని చెయ్‌రా భాయ్.... పని చెయ్‌రా" అంటూ కూలీజనం సుఖంగా ఉండడానికి వాళ్లతో హరినామస్మరణ చేయించి పుణ్యం సంపాదించిపెట్టడానికి అఖండానంద స్వాములవారిని పిలిపిస్తాడు. ఆయన తనకు వచ్చిన శ్లోకాలు చదివి, మన కష్టసుఖాలకు కారణం పూర్వజన్మ సుకృతమే అని బోధిస్తాడు. ఈ జన్మలో యజమానిని భక్తితో కొలిస్తే వచ్చే జన్మలో మీరే యజమాని కావచ్చునంటాడు. పటేలు ఆయనతో "స్వామీ! మీరు స్వర్గ, నరకాలు చూసి అక్కడి పటాలు తెచ్చారు గదా! వీళ్లకు చూపించండి" అంటాడు. ఆయన అమృతం సేవిస్తూ అప్సరసలతో కులికే స్వర్గ పటాన్ని, బల్లేలతో పొడుస్తూ నానాహింసలకు గురిచేస్తున్న నరకం పటాన్ని వాళ్లకు చూపిస్తాడు.... "ఇవి మా గోదాములో అంటించుకుంటాం. ఇవ్వరూ?" అని అడిగాడు పటేల్. అట్లాగేనంటాడు స్వాములవారు. వాటిని గోదాములో బాగా కనిపించే చోట అతికించుకున్నాడు పటేల్.

ఈ స్వాములవారి ప్రవచనాలతో కూలీలు యింకా బాగా పనిచెయ్యడం మొదలుపెడతారు. ఇంతలో రాముడు పెళ్లాం మల్లమ్మ పుట్టింటికి వెళ్లి తిరిగొస్తూ ఓ రంగురంగుల కాగితం తెచ్చింది. అక్కడెవ్వరికీ చదువురాదు. ఏమిటిది, ఏమిటిది అని మల్లాగుల్లాలు పడతారు. చివరకు స్వర్గం – నరకం పటాల మధ్య యీ కాగితాన్ని అంటించి ఆనందంగా పాడుకుంటూ పనిచేసుకుంటూ వున్నారు.

ఇదే కథకు మలుపు. అమాయకులు, అక్షరజ్ఞానం లేనివాళ్లు ఒక కాగితాన్ని గోడకు అంటిస్తే – మర్నాడు పటేలు వచ్చి ఆ కాగితాన్ని చూసి ఉగ్రుడై యిది ఎవరంటించారని రెట్టిస్తాడు. పటేలుకు యీ కోపం ఎందుకో కూలీలకు అర్థంకాలేదు. 'ఎవరో యీ చుట్టుపక్కల తిరుగుతూ కూలివాళ్లను ఉసికొల్పుతున్నారట! నా దగ్గర యీ పప్పులేం వుడకవు... మీరంతా బీదవాళ్లు.... అయినా వ్యాపారం బాగాలేదు. ఇప్పుడు మీకు నాలుగు రూపాయలు కూలీ యివ్వడమంటే నేనెక్కడ యిస్తాను?.... ఒక అరణా పెంచుతున్నా. ఆ వెధవలు యీ చుట్టుపక్కలే వున్నారు. వాళ్లతో మాట్లాడితే మీకు యీ కూలీపని కూడా దొరక'దని హెచ్చరిస్తాడు.

పటేలు వెళ్లగానే కూలీలు ఆనందంతో గంతులు వేశారు. కాని అరణా ఎందుకు పెంచాడో తెలియలా.... ఈ కాయితంలో ఏదో రాసుంటది. అందుకే పెంచి వుంటాడని వాళ్లకు అర్థం అయింది. అందులో ఏముందో తెలుసుకోవాలంటే పంతులొక్కడే చేయగలడు అని ఆయనను తీసుకొనిరావడానికి రాములు వెడతాడు. ఆయనతో యీ కాగితం సంగతి చెప్పి మీరొక్కసారి వచ్చి ఆ కాగితంలో ఏముందో చెప్పాలంటాడు. పంతులు వచ్చి ఆ కాగితం చూసి నిర్ఘాంతపోతాడు. "మజ్దూర్ యూనియన్ జిందాబాద్... కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి" అని వున్నదా కాగితంలో. అంతేకాదు, కూలీ నాలుగు రూపాయలకు పెంచండి. లేకపోతే పరిణామాలు భయకరంగా వుంటాయి అని రాసుంది – అంటాడు పంతులు.

ఈ అదును చూసుకొని యిటువంటివే మరో అయిదు కాగితాలు రాయించుకొని మర్నాడు మళ్లీ అతకుపెడతారు. పటేలుకు యీసారి కోపంతోపాటు భయంకూడా పట్టుకున్నది. కూలీలను బెదిరించి మరో అరణా పెంచాడు.

రెండురోజుల్లో రెండు అరణాలు పెంచిన సందర్భంగా కూలీలంతా సంబరాలలో వుండగా పటేల్ మాత్రం ఫారెస్టు ఆఫీసరుకు పార్టీ యిస్తూ అతన్ని కాకా పడుతున్నాడు. మంచి నిషామీద ఉండగా ఫారెస్టు ఆఫీసరు ఇవన్నీ మామూలే – మంచి అడవిమల్లె ఒకటి కావాలంటాడు. ముందు అర్థంకానట్లు నటించినా ఆ తరువాత "చిత్తం – ఏర్పాటుచేసి తమకు కబురుచేస్తా" నంటాడు.

పటేల్ కన్ను అదివరకే రాములు పెళ్లాం మల్లమ్మ మీద పడ్డది. దాన్ని తన యింట్లో పనికి కుదిర్చి రాములుకు గాంగ్‌లీడర్‌గా అడవిలో పనిచేయడానికి పంపుతాడు. అతనికి జీతం పెంచాడు. ఆ విషయం సంతోషంగా పంతులుకు చెబుదామని వచ్చాడు. పంతులు రాములుకు వివరంగా అసలు విషయం చెబుతాడు. ఇదివరకు గుమాస్తాను కూడా గాంగ్‌లీడర్‌గా పంపి, వాళ్లావిడను తన యింట్లోనే డ్యూటీ వేశాడు. "ఇప్పుడావిడ పటేల్‌కు ఏమవుతుందో ఊళ్లో వాళ్లందరికీ తెలుసు" నంటాడు.

అలా జరగడానికి వీలులేదు. నేను మల్లమ్మని పటేల్ యింట్లో కొలువుకు పంపనంటాడు రాములు. అట్లా అని రాయించి కాగితం అంటించిపెడతానన్నాడు రాములు. పంతులు "కిందటిసారి అందరిపనీ కనక కాగితం రాస్తే అందరు ఒక్కటిగా నిలబడ్డారు. ఇప్పుడు నీపక్షాన ఎవ్వరూ నిలవరు, ఇది నీ స్వంత విషయం – అంటారు, జాగ్రత్త" అంటాడు. రాములు తనవాళ్లందరికీ యీ అన్యాయాన్ని గురించి చెప్పాడు. ఎవ్వరూ మళ్లీ కాయితం రాసి అంటించడానికి సిద్ధంగాలేరు. అయినా రాములు 'మీరువచ్చినా రాకున్నా నేను మాత్రం మల్లమ్మని పటేల్ యింటికి పంప" అంటూ కాగితం రాసి అంటించాడు.

మర్నాడు పటేల్ "మల్లమ్మ పటేల్ యింటికి రాదు" అన్న కాగితం చూస్తాడు. రాముల్ని పట్టుకొని యిదంతా నీపనే నని వాడిని చచ్చేట్లు కొడతాడు.... "మిమ్మల్నెవరో రెచ్చగొడుతున్నారు. నేను పోలీసుల్ని పిలుస్తా. వాళ్లొచ్చి మీకు బుద్ధిచెబుతారు, అని మళ్లీ రాముల్ని కొట్టి "దీన్ని యిప్పుడు కుక్కను యీడ్చుకుపోయినట్లు యీడ్చుకుపోతాను.... ఎవడడ్డం వస్తాడో చూస్తాను..... పిలవండ్రా మీ నాయకుణ్ణి" అని మల్లమ్మను పట్టుకొని లాకెళ్లడానికి సిద్ధపడ్డాడు. ఇంతలో మరో కూలి పటేల్ దగ్గరకు వచ్చి "చెయ్యి ఇడు" అంటాడు. ఇది అందరూ కలిసి ఆడుతున్న నాటకమని తెలిసిపోయింది పటేల్‌కు. మెల్లగా పటేల్ చేతిలోంచి కొరడా తీసుకొని అతన్ని కొట్టడం మొదలుపెడతాడు. అందరు కూలీలు కలుస్తారు. "కొట్టకండిరా... మీకు నాలుగు రూపాయలు కూలీ యిస్తా... మల్లమ్మ మా యింటికి రానక్కర్లేదు" అంటూ అరుస్తాడు.

కీర్తనకారుడు "పోరు సాగుతోంది..... రణభేరి మోగుతోంది" అని పాట పాడితే, అక్కడికి చేరిన శ్రోతలంతా మల్లమ్మ కేమయింది? రాములికి? కూలీలకి? – అని ఆత్రంగా అడుగుతారు. "చేజిక్కిన శత్రువును వదిలినందుకు వాళ్లంతా ఫలితం అనుభవించవలసి వచ్చింది. కూలీలందర్నీ దొమ్మీ చేశారని పోలీసులు తీసుకుపోయారు. మల్లమ్మ పటేలు యింట్లో ఉంది....

ఒకటవ శ్రోత "యిది అన్యాయం. డబ్బు, అధికారం – వీటి పర్యవసానం దిక్కులేనివాళ్లమీద అత్యాచారం చేయడమేనా? వాళ్లను అడ్డుతొలగించటం కష్టంకాదు. ఆతరువాత వాళ్లుపెట్టే హింసల్ని భరించాలి. అదే భయం" అంటాడు. కీర్తనకారుడు "మీఆడవాళ్లకి జరుగుతున్న అన్యాయాల్ని ఎదుర్కోవాలంటే అటువంటి రావణాసురుల దురాగతాల్ని బట్టబయలు చేసే ధైర్యం కావాలి. నలుగురూ కలిసి నడుంబిగించాలి" అని హితవు చెప్పాడు.

అందరూ అందుకు సిద్ధపడ్డారు. బిగించిన పిడికిలిని విప్పకూడదన్న నినాదంతో ఆ గుళ్లో జరిగిన అత్యాచారాన్ని బట్టబయలు చేయడానికి ఊరివారంతా నడుంకడతారు.

గొప్ప సందేశాత్మకమైన నాటకం. నాటకం ఆసాంతం కన్నులకు, చెవులకు, మనస్సుకు ఆహ్లాదం, ఉత్తేజం కలిగేవిధంగా దర్శకులు శ్రీ నాగభూషణశర్మ అద్భుతంగా తీర్చిదిద్దారు. భిక్షు, సుబ్రహ్మణ్యశాస్త్రిగార్ల సంగీతం నాటకాన్ని అర్థవంతం చేసింది. శివరాజు, అరుణలు రూపొందించిన కూలీల పాటలు మంచి రిలీఫ్.

కీర్తనకారుడిగా భిక్షు, వంతగా ఫ్రాన్సిస్ నాటకాన్ని నడిపిన తీరు బావుంది. రాములుగా ప్రసాదరెడ్డి యీ నాటక విజయానికి బాగా తోడ్పడ్డాడు. మల్లమ్మగా కల్యాణి; పంతులుగా డి.యస్. దీక్షిత్ తమ పాత్రలను చక్కగా పోషించారు.

ఒక గొప్ప నాటకాన్ని చూశామన్న అనుభూతిని కలిగించేటట్లు నాటకాన్ని ప్రదర్శించిన కేంద్ర విశ్వవిద్యాలయం నాటక విభాగాన్ని ప్రతివారూ అభినందించక తప్పదు.



ఆంధ్రనాటకరంగ దినోత్సవం నాడు శర్మ దంపతులకు సన్మానం



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహితీప్రతిభామూర్తి అవార్డు ప్రదానం చేస్తున్న సద్గురు శివానందమూర్తి